క్లుప్తంగా

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కొత్త ప్రభుత్వం మహిళలకు మహాలక్ష్మీ పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం గొప్ప విషయం అని అన్నారు. దీని ద్వారా ఎంతో మంది బాలికలకు చదువుకునేందుకు అవకాశం దొరుకుతుందని తెలిపారు. వైస్‌ప్రిన్సిపాల్ ముంతాజహాన్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య స్ఫూర్తితో సభ నడపాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: గతానికి భిన్నంగా శాసనసభను ప్రజాస్వామ్య స్ఫూర్తితో సభను నడపాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం నూతన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ ప్రసంగించారు. స్పీకర్‌గా ఎన్నికైనందుకు ఒక ఉద్యమ నేపథ్యం ఉన్న తెలంగాణ ఉద్యమకారుడిగా ఎంతో గర్వంగా ఉందన్నారు. ఒక కుటుంబ పెద్దగా శాసనసభలో అధికార, ప్రతిపక్షానికి మాట్లాడడానికి సముచిత స్థానం కల్పించాలని కోరారు.

16న టీబీ క్యాంపు

గండేడ్: ఈనెల 16న గండేడ్‌లో టీబీ క్యాంపు నిర్వహించనున్నట్లు వైద్యాధికారి చంద్రశేఖర్ పేర్కొన్నారు. గండేడ్, మహమ్మదాబాద్ మండలాలకు కలిపి గండేడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్యాంపు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రెండు మండలాల ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఇసుక డంప్‌లు సీజ్

నవాబుపేట: మండల పరిధిలోని ఇప్పటూర్, కారూర్ గ్రామాలకు చెందిన రాజాపూర్ మండల సరిహద్దులో ఉన్న అక్రమ ఇసుక నిల్వలపై చర్యలు తీసుకున్నట్లు తహసీల్దార్ మల్లికార్జున్ రావు, ఏఎస్‌ఐ ఆనంద్ గురువారం తెలిపారు. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అక్రమ ఇసుక తరలింపుపై చర్యలు తీసుకోవాలని మండల అధికారులకు ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో పలు డంప్‌లను గుర్తించి వాటిని సీజ్ చేశారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాగు సరిహద్దులో ఇసుక తరలింపునకు ఉపయోగించే రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

బాధ్యులందరిపై చర్యలు తీసుకోవాలి

నవాబుపేట: అక్రమ ఇసుక రవాణా ఆరోపణల నేపథ్యంలో బాధ్యులందరిపై చర్యలు తీసుకోవాలని పక్షపాత ధోరణి సరికాదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహులు అన్నారు. గురువారం తహసీల్దార్ మల్లికార్జున్ రావుకు వినతిపత్రం అందించారు. బీఆర్ఎస్ నాయకులపై కేసులు నమోదు చేసి కాంగ్రెస్ వ్యక్తులను వదిలేశారని ఆరోపించారు. సర్పంచ్‌లు గోపాల్‌గౌడ్, నర్సింహానాయక్, యాదయ్య, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ ఉన్నారు.

బిల్లులు ఇవ్వకుంటే కోర్టుకు వెళ్తాం

అడ్డాకుల: కందూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం సర్పంచ్ శ్రీకాంత్ వార్డు సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇంకుడు గుంతల నిర్మాణాల గురించి చర్చ చేశారు. నిర్మాణాలు పూర్తయిన వాటికి బిల్లులు చెల్లించాలని సందర్భంగా డిమాండ్ చేశారు. అప్పటి అధికారులే గ్రామ పంచాయతీ ద్వారా ఇంకుడు గుంతల నిర్మాణాలకు అడ్వాన్సులు ఇప్పించారని గుర్తు చేశారు. ఇప్పుడేమో బిల్లులు చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేసిన పనులకు బిల్లులు ఇవ్వకుంటే కోర్టుకు వెళ్తామని హెచ్చరించారు. వార్డు సభ్యులు లక్ష్మయ్య, తోకల దామోదర్‌రెడ్డి, మనోహర్, బజార్ నాగరాజు, శ్రీనివాస్, భాస్కర్, మహేష్, శాంతయ్య తదితరులు ఉన్నారు.

సాయిబాబాకు పూజలు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని సాయినగర్ సకల దేవతల ఆలయంలో గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు ఉదయం సాయివ్రతం, పల్లకీసేవలు, మధ్యాహ్నం మహామంగళహారతి నివేదించారు. కార్యక్రమానికి మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. హారతి సమయంలో సాయినామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అదేవిధంగా విజయ్‌నగర్ కాలనీలోని సాయిబాబా ఆలయంలోనూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

అడ్డాకుల: సంకలమద్ది శివారులోని 44వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలానికి చెందిన ప్రవీణ్ కుమార్ ద్విచక్రవాహనంపై మూసాపేట వైపు వెళ్తున్న క్రమంలో మార్గమధ్యలో శ్రీకృష్ణ హోటల్ దాటిన తర్వాత జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. తలకు తీవ్రగాయం కావడంతో స్థానికులు బాధితుడిని 108 అంబులెన్స్‌లో జిల్లా కేంద్రానికి.. తరువాత మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. కాగా ప్రమాదం జరిగినప్పుడు ఎవరూ చూడకపోవడంతో ద్విచక్రవాహనాన్ని ఏదైనా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిందా...లేక అతడే అదుపు తప్పి కిందపడ్డాడా అనే విషయం తెలియరాలేదు. దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు.

చురుగ్గా రోడ్డు విస్తరణ


డిగ్రీ కళాశాలవద్ద నిర్మిస్తున్న సర్వీస్‌రోడ్డు వాల్స్


ఎస్సీహాస్టల్ వద్ద..


రైల్వే వంతెనకోసం..

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటి పరిధిలోని సిగ్నల్‌గడ్డపై 167వ నంబరు జాతీయరహదారిపై రోడ్డు విస్తరణ పనులు చురుకుగా సాగుతున్నాయి. రైల్వేలైన్‌పై వంతెన నిర్మాణం కోసం నీళ్లట్యాంక్ ఉన్న వైపు ఫిల్లరు పనులు చేస్తుండగా ఎస్సీహాస్టల్‌వైపు పిల్లర్ నిర్మాణం కోసం హిటాచీ సాయంతో మట్టి తీస్తున్నారు. విస్తరణలో భాగంగా ఎల్‌ఐసీ కార్యాలయం నుంచి కల్వకుర్తిరోడ్డులో డిగ్రీ కళాశాల హస్టల్ వరకు రోడ్డు వేయనున్నారు. పనుల్లో భాగంగానే రైల్వేలైన్‌పై వంతెన నిర్మాణం చేపడుతున్నారు. పిల్లర్ల నిర్మాణం పూర్తయ్యాక వంతెనకోసం తయారు చేసిన బ్లాగ్స్‌ను అమర్చనున్నారు. ఇదే మార్గంలో డిగ్రీ కళాశాల వద్ద సర్వీస్‌రోడ్డు పనులు చేపట్టారు. ప్రధానరోడ్డు మెయింటెన్స్‌వాల్‌తోపాటు సర్వీస్ రోడ్డుకు సంబంధించిన వాల్ పూర్తికావస్తోంది. అలాగే రైల్వేట్రాక్ వద్ద వంతెనకు అనుబంధంగా ఇరువైపులా అండర్‌బ్రిడ్జ్‌ల నిర్మాణం చేయనున్నారు. డిగ్రీ కళాశాల వెంబడి విస్తరణ పనులు కొనసాగుతుండటంతో నిత్యం వాహనాల రాకపోకలకు కొంత అంతరాయం ఏర్పడుతోంది. ఇదేరోడ్డులో సెయింట్ ఆగ్నేస్ పాఠశాల వైపు ప్రధానరోడ్డుకు సంబంధించిన మెయింటెన్స్ వాల్ నిర్మాణ పనులు సైతం ప్రారంభిస్తున్నారు. ఇందుకోసం హిటాచీల సాయంతో మట్టి తీసే పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇక ఎస్సీహాస్టల్ ప్రహరీ కూల్చివేతకు అనుమతి రాకపోవటంతో అక్కడ పనులు కొంత నెమ్మదించాయి. అనుమతి రాగానే డ్రెయినేజీ, ఫుట్‌పాత్‌ల నిర్మాణం వేగవంతం చేయనున్నారు.

హామీలు అమలు చేసేదాక వేచి చూద్దాం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల: కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారంటీ హామీలను వంద రోజులలో అమలు చేస్తామని చెప్పిందని అంతవరకు వేచి చూద్దామని మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం స్థానిక నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ఆచరణ సాధ్యంకాని హామీలతో ప్రజలను మభ్యపెట్టిందని అన్నారు. హామీలు అమలయ్యే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. అమలు చేస్తే సంతోషిస్తామన్నారు. పదవులు ముఖ్యం కాదని, ప్రజల సమస్యలను పరిష్కరించడమే ధ్యేయమన్నారు. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి బీఆర్ఎస్‌పై చేసిన ఆరోపణలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. తమ పార్టీలోకి వస్తామని ఎవరు ఫోన్లు చేశారో బయటకు చెప్పాలని డిమాండ్ చేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

అడ్డాకుల: కందూర్‌కి చెందిన రాంచంద్రయ్య అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని గురువారం బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మున్నూర్ రమేష్ పరామర్శించారు. రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. అండగా ఉంటానని భరోసానిచ్చారు. బుద్దన్న యాదవ్, బుచ్చన్న, సత్యన్న తదితరులు ఉన్నారు.

సీఎంను కలిసిన నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గురువారం హైదరాబాద్‌లో ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి ముకుందం రమేశ్‌తో పాటు నాయకులు మర్యాదకపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. గ్రామస్థాయి కార్యకర్త నుంచి రాష్ట్రస్థాయి నాయకుడి వరకు అందరికీ సహకారం ఉంటుందని రేవంత్‌రెడ్డి చెప్పినట్లు రమేశ్ వివరించారు.

రైతులను మభ్యపెడుతున్న దళారులు

- తక్కువ ధరకే పత్తి కొనుగోలు!

నవాబుపేట: పత్తికి మద్దతు ధర ఇవ్వాలని రైతులు ఒకవైపు డిమాండ్ చేస్తుంటే మరో పక్క దళారులు గ్రామాల్లో అక్రమంగా కొనుగోలు చేస్తూ వారిని మోసం చేస్తున్నారు. అక్రమంగా గ్రామాలకు వెళ్లి ఇష్టానుసారంగా ధర చెల్లించి తీవ్రంగా నష్టపరుస్తున్నారు. పత్తిని మార్కెట్‌కు తరలించాలంటే దూరభారం అవుతుందని, తరలింపునకు ఖర్చులుంటాయని, సమయం వృథా అవుతుందని పలు సాకులు చూపించి రైతులను మభ్యపెడుతున్నారు. రూ. మూడు నుంచి రూ. నాలుగు వేలకు క్వింటాల్ తీసుకుంటున్నారు. దీనిపై అధికారులు సైతం నోరు మెదపడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ముఖ్యంగా మారుమూల గ్రామాలైన పోమాల్, కేశవరావుపల్లి, చౌడూర్, మరికల్, కొల్లూర్ గ్రామాల్లో గుట్టు చప్పుడు కాకుండా పత్తి కొనుగోలు చేస్తున్నారని సమాచారం. కాగా విషయంలో అధికారులు చర్యలు చేపట్టి రైతులకు అన్యాయం జరగకుండా చూడాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొంటున్నారు.


పోమాల్‌లో పత్తి తరలింపు

అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రజాసంక్షేమం, ప్రగతిశీల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని ఆ పార్టీ నాయకుడు, ప్రముఖ సామాజికవేత్త హనీఫ్ అహ్మద్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తీసుకుంటున్న విప్లవాత్మకమైన నిర్ణయాలు హర్షనీయమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలుచేసేలా అధిష్టానం కృతనిశ్చయంతో ఉన్నదని, ఇప్పటికే హామీల అమలుకు శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. తెలంగాణ ప్రజానీకం స్వేచ్ఛ, సమాన అభివృద్ధి, ఉద్యోగాల కల్పన కోరుకున్నారని, అందులో భాగంగానే నియంతృత్వ బీఆర్ఎస్ పాలనకు చరమగీతం పాడారని వివరించారు. ఆరు గ్యారంటీలపై కేటీఆర్ వ్యాఖ్యలు అర్థరహితమని విమర్శించారు.

అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి


రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ జయరాములు

కోయిల్‌కొండ: పంచాయతీల అభివృద్ధే లక్ష్యంగా కార్యదర్శులు పనిచేయాలని ఎంపీడీఓ జయరాములు అన్నారు. గురువారం బుర్గుపల్లి, శేరివెంకటాపూర్, చిన్నలింగల్‌ఛేడ్, సూరారం, మల్లాపూర్, కొత్లాబాద్ గ్రామాల్లో పర్యటించారు. రికార్డులను తనిఖీ చేశారు. అదేవిధంగా నర్సరీల్లో జరుగుతున్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏపీఓ నర్సయ్య, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలకు సమావేశం



మిడ్జిల్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వాహణపై గురువారం తహసీల్దార్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు బీఎల్‌ఓలకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 18 సంవత్సరాలు పైబడిన వారికి నూతనంగా ఓటు హక్కు నమోదు చేయించాలని సూచించారు. ఓటర్ జాబితాల్లో తప్పులు లేకుండా సరి చూసుకోవాలని సూచించారు. తహసీల్దార్ రాజునాయక్, ఎంపీడీఓ సాయిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కోయిల్‌కొండ: వచ్చేనెల 1 వరకు గ్రామాల్లో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరు నమోదు చేయించాలని తహసీల్దార్ భరత్‌గౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో సమావేశంలో మాట్లాడారు. గ్రామపంచాయతీ, ఎంపీ, సింగిల్‌విండో ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని నమోదుకు చర్యలు చేపట్టాలని సూచించారు.

గోల్డ్‌మెడల్ సాధించిన విద్యార్థికి అభినందన

గండేడ్: వాలీబాల్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారుడిని గోల్డ్‌మెడల్ వరించింది. వివరాల్లోకి వెళితే ఈనెల 11వ తేదీన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పోటీలు నారాయణపేట్‌లో జరిగాయి. సల్కర్‌పేట్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న గిరమోని శివకుమార్ అండర్ 14 వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నాడు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చి గోల్డ్‌మెడల్ సాధించాడు. ఈమేరకు గురువారం సల్కర్‌పేట్ పాఠశాలలో శివకుమార్‌కు సన్మానం చేశారు. ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో పీడీ అబ్దుల్లా బిన్ హైమద్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థిని సన్మానిస్తున్న హెచ్‌ఎం విజయలక్ష్మి

క్రీస్తు బోధనలు విశ్వశాంతికి సోపానాలు


జిల్లా కేంద్రంలో కేక్‌కట్ చేస్తున్న పాస్టర్ వరప్రసాద్ తదితరులు


జిల్లాకేంద్రంలో కొవ్వొత్తులను ప్రదర్శిస్తున్న క్రైస్తవులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఏసు క్రీస్తు బోధనలు విశ్వశాంతికి సోపానాలని ఎంబీసీ చైర్మన్, సీనియర్ పాస్టర్ రెవరెండ్ ఎస్.వరప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రం క్రిస్టియన్‌కాలనీలోని ఎంబీ ప్రార్థనా మందిరంలో గురువారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. వేడుకల్లో పాస్టర్ వరప్రసాద్ పాల్గొని సందేశం ఇచ్చారు. ఏసుక్రీస్తు బోధనలు మానవాళికి ఆచరణీయమని అన్నారు. అనంతరం చిన్నారుల ప్రదర్శించిన వివిధ స్కిట్‌లు ఆకట్టుకున్నాయి. పాస్టర్ వరప్రసాద్ తదితరులు కేక్‌కట్ చేశారు. క్రిస్మస్ వేడుకలకు గుర్తుగా కొవ్వొత్తులను వెలిగించి ప్రదర్శించారు. కార్యక్రమంలో కల్వరి ఎంబీసీ చర్చి వైస్ చైర్మన్ బీఐ.జేకబ్, కార్యదర్శి జేఐ.డేవిడ్, కోశాధికారి టీఎ.స్టిఫెన్, డానియల్ సుదీర్, పాస్టర్ విల్సన్, సీజే బెనహర్, సండే స్కూల్ సూపరింటెండెంట్ సువర్ణ డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: పాస్టర్లు సందేశాలతో ప్రజలను స్ఫూర్తివంతంగా మార్చాలని సినోడ్ ఆఫ్ తెలంగాణ జనరల్ సెక్రటరీ, లైట్ ఆఫ్ తెలంగాణ చైర్మన్ మోహన్‌బాబు సందేశమిచ్చారు. పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని బేథనీ యంబీ చర్చ్‌లో గురువారం క్రిస్మస్ సంబరాలు ఘనంగా నిర్వహించారు. క్రీస్తు అడుగుజాడల్లో పయనించాలని పిలుపునిచ్చారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు విలియంబూత్, కార్యదర్శి ఏలియా, కోశాధికారి ప్రకాష్, పాస్టర్లు పాల్గొన్నారు.


జడ్చర్లలో వేడుకల్లో పాల్గొన్న పాస్టర్లు

పాఠశాలకు పేరు తీసుకురావాలి

జడ్చర్ల టౌన్: భువనేశ్వర్‌లో జరగనున్న జాతీయ రగ్బీ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు మండలంలోని ఆలూరు జెడ్పీహైస్కూల్‌కు చెందిన కావ్య, దీక్షిత ఎంపికైనట్లు హెచ్‌ఎం యుగంధర్ గురువారం తెలిపారు. విద్యార్థులను పాఠశాల ఆవరణలో అభినందించారు. పీఈటీ జగన్‌మోహన్‌గౌడ్, ఉపాధ్యాయ బృందం తదితరులు ఉన్నారు. జాతీయ పోటీల్లో రాణించి పాఠశాలకు, జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.


రాష్ట్ర జట్టుకు ఎంపికైన విద్యార్థులు

రక్తదానం మానవతకు దర్పణం


శిబిరంలో రక్తదానం చేస్తున్న యువత

స్టేషన్ మహబూబ్‌నగర్: రక్తదానం మానవతకు దర్పణమని జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ లయన్ నటరాజ్ అన్నారు. జిలా కేంద్రంలోని ప్రభుత్వం బాలుర జూనియర్ కళాశాల మైదానంలో బాగ్దాద్‌కు చెందిన పీఠాధిపతి హజ్రత్ పీర్ హాషిమోద్దీన్ గిలానీ జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని నటరాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం చేసే రక్తదానం వల్ల అత్యవసర సమయాల్లో ఒకరి ప్రాణాలను కాపాడవచ్చని అన్నారు. ప్రతి ఏడాది రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో సయ్యద్ షఫియోద్దీన్, బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ ఎండి.షబ్బీర్, మౌలానా నయీం కౌసర్, జహీరుల్లా ఖాస్మి, జహంగీర్, ముజంబిల్, యాసర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఫుట్‌బాల్ టోర్నీ...

ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పీర్ హాషిం ఫుట్‌బాల్ టోర్నీ గురువారం ముగిసింది. సీనియర్ విభాగం నవాజ్ ఎఫ్‌సీ విన్నర్‌గా, మహబూబ్‌నగ్ ఎఫ్‌సీ రన్నరప్‌గా, జూనియర్‌లో మహబూబ్‌నగర్ ఎఫ్‌సీ విన్నర్‌గా, రాజాపూర్ ఎఫ్‌సీ జట్టు రన్నరప్‌గా నిలిచాయి.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

అడ్డాకుల: మండల కేంద్రానికి చెందిన ఇద్దరికి జెడ్పీటీసీ సభ్యుడు ఎన్.రాజశేఖర్‌రెడ్డి గురువారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అడ్డాకులకు చెందిన అంజనేయులుకు రూ.60వేలు, జాహంగీర్‌బీకి రూ.58వేలు సీఎం సహాయనిధి ద్వారా మంజూరు అయినట్లు వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఎంపీటీసీ రంగన్నగౌడ్, విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, కోఆప్షన్ ఖాజాఘోరీ పాల్గొన్నారు.


చెక్కులను అందజేస్తున్న జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి

యువతితో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తి

మహమ్మదాబాద్: యువతితో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోలీసులు కేసునమోదు చేసిన ఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గండేడ్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన ఓ ఇంట్లో తల్లిదండ్రులు, సోదరుడు ఈ నెల 12న పనిమీద బయటకు వెళ్లగా బాధితురాలు ఒంటరిగా ఉండడం గమనించి నిందితుడు శేఖర్ ఆమెను ఇంటికి పిలిచాడు. వరుసకు సోదరుడైన అతడు పిలవడంతో యువతి ఇంటికి వెళ్లింది. దీంతో శేఖర్ ఇంటి తలుపులు మూసి యువతి చేతులు పట్టుకుని అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఘటనపై బాధితురాలు ఫిర్యాదు చేయడంతో కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మహమ్మదాబాద్ ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

మహబూబ్‌నగర్ రూరల్: డీఆర్‌డీఓ కార్యాలయంలో నడుస్తున్న అద్దె వాహనాల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఫోర్ వీలర్స్ డ్రైవర్స్ హైర్ వెహికిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్కకు వినతి పత్రం అందజేశారు. వెంటనే బిల్లులు విడుదల చేయాలని మంత్రిని కోరారు. జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ తదితరులు ఉన్నారు.

మంత్రులకు కలిసిన ఎమ్మెల్యే

దేవరకద్ర: నియోజకవర్గ ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి గురువారం రాష్ట్ర సచివాలయంలో మంత్రులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, రెవన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలు సచివాలయంలో బాధ్యతలు తీసుకున్న సందర్భంగా వారికి పుష్పగుచ్చాలు అందజేశారు.

పాలనా 'సౌలభ్యం' ఏదీ..?

- పేరుకే కొత్త మండలాలు...
- ఏర్పాటు కాని కొత్త కార్యాలయాలు
- పలువురు అధికారులు, ప్రతినిధులు ఉమ్మడిగానే..
- ప్రజలకు తప్పని తిప్పలు


గండేడ్ ఎంపీడీఓ కార్యాలయం

గండేడ్: పాలనలో పారదర్శకత, వేగవంతమైన అభివృద్ధి చేపట్టాలన్న ఉద్దేశ్యంతో గతంలో కొత్త జిల్లాల ఏర్పాటుతో పాటు కొత్త మండలాలను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా గండేడ్ మండలాన్ని రెండుగా విభజించి కొత్తగా మహమ్మదాబాద్ మండలాన్ని ఏర్పాటు చేశారు. అయితే మండలాలు ఏర్పాటు పేరుకు మాత్రమే జరిగిందని చాలావరకు పాలనా సంబంధ వ్యవహారాలు, కార్యాలయాలు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఇంకా రెండు మండలాలకు కలిపి ఉమ్మడిగానే ఉన్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. కార్యాలయాలు వంటివి నూతనంగా వేర్వేరుగా లేకపోవడంతో తిరిగి పాత మండలానికే వెళ్లాల్సి వస్తోందని అంటున్నారు. కొత్త మండలాల ఏర్పాటుతో ఒకట్రెండు కార్యాలయాలు తప్ప పెద్దగా మార్పేమీ కనిపించడం లేదని, పెద్దగా ఒరిగిందేమీ లేదని ప్రజలు చెబుతున్నారు. మహమ్మదాబాద్ మండలం ఏర్పాటు కాకముందు గండేడ్ పరిధిలో 24 గ్రామ పంచాయతీలు ఉండేవి. కొత్త మండలంతోపాటు కొత్తగా అదనంగా 25 గ్రామపంచాయతీలు ఏర్పాటు కావడంతో ప్రస్తుతం 49 మంది సర్పంచులు 19 మంది ఎంపీటీసీలు అయ్యారు. వీరందరికి ఏ సమావేశం పెట్టాలన్నా స్థలం చాలక టెంటు వేసి మరి పెట్టాల్సి వస్తోంది.

పరిస్థితి ఇలా..

ఉమ్మడి గండేడ్ మండలం గండేడ్, మహమ్మదాబాద్‌గా విడిపోయి సంవత్సరాలు గడుస్తున్నా గండేడ్‌లో ఉన్న ఎంపీడీఓ కార్యాలయమే ఉమ్మడిగా కొనసాగుతోంది.

పోలీస్‌స్టేషన్ కూడా ఉమ్మడి మండలానికి కలిపి మహమ్మదాబాద్‌లో గతంలో ఏర్పాటు చేసిందే ఉంది. గతంలో గండేడ్ మండల కేంద్రంలో అవుట్‌పోస్టును ఏర్పాటు చేసి కొన్నాళ్లు సేవలు అందించారు కానీ దానిని ఆరునెలల క్రితమే ఎత్తేశారు. దీంతో పరిస్థితి మొదటికి వచ్చింది.

గండేడ్, మహమ్మదాబాద్ మండలాలకు ఎంఈఓ ఒక్కరే ఉన్నారు. వీరి కార్యాలయం గండేడ్‌లో ఉంది. కొసమెరుపు ఏమిటంటే.. గండేడ్ ఎంఈఓనే నాలుగు మండలాలకు ఇన్‌చార్జ్‌గా ఉన్నారు.

అదేవిధంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గండేడ్‌లో ఉంది. డీసీసీబీ మాత్రం మహమ్మదాబాద్‌లో ఉంది. రైతులకు ఉపయోగపడే ఈరెండు కూడా విడివిడిగా ఉండడంతో రెండు మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఉమ్మడి మండలానికి కలిపి అటవీ కార్యాలయం మహమ్మదాబాద్‌లో ఉంది. గండేడ్ మండలానికి రేంజర్ స్థాయి అధికారి లేకపోవడంతో కేవలం సెక్షన్ ఆఫీసర్లతోనే కొనసాగుతున్నది.


మహమ్మదాబాద్ పోలీస్‌స్టేషన్

ఉమ్మడి మండలానికి ఎంపీపీ, జెడ్పీటీసీలు కూడ పాతవారే ఉన్నారు. దీంతో మహమ్మదాబాద్ మండలానికి తగిన ప్రాతినిధ్యం సమకూరడం లేదన్న అసంతృప్తి చోటుచేసుకుంటున్నది.

దీంతో ఇప్పటికైనా పాలకులు ఉన్నతాధికారులు కల్పించుకొని మండలాల వారీగా సంబంధిత కార్యాలయాలు ఏర్పాటు చేసి అధికారులను నియమించి సత్వర అభివృద్ధికి కృషి చేయాలని గండేడ్, మహమ్మదాబాద్ మండలాల ప్రజలు కోరుతున్నారు. కొత్త ప్రభుత్వ హయాంలోనైనా కొత్త మండలాల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం

మండలాలు ఏర్పాటు అయినా గండేడ్‌లో పోలీస్‌స్టేషన్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. మహమ్మదాబాద్‌కు వెళ్లాలంటే దాదాపు 30 కిలోమీటర్లకు పైగా అవుతున్నది. అత్యవసర సమయాల్లో పోలీసుల సాయం తీసుకోవాలంటే ఇక్కట్లు తప్పడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

–గంగుల పుల్లారెడ్డి, సర్పంచ్, వెన్నాచేడ్

అభివృద్ధికి అవరోధం

ఉమ్మడి మండలానికి ఎంపీపీ, జెడ్పీటీసీ, పలువురు అధికారులు తదితరులు ఒక్కరే ఉండడం వల్ల అభివృద్ధికి అవరోధం కలుగుతోంది. అదే ప్రత్యేకంగా వేర్వేరుగా ఉంటే ప్రయోజనం చేకూరుతుంది. అంతేకాకుండా ఎంపీడీఓ కార్యాలయం కూడ స్థానికంగా ఏర్పాటు చేయకపోవడం వల్ల చీటికి మాటికి గండేడ్‌కు వెళ్లాల్సివస్తోంది.

–రాజశేఖర్ గౌడ్, మహమ్మదాబాద్